
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

ఖమ్మం

ఆదివారం 01 సెప్టెంబర్ 2024

## వ్యవసాయ మార్కెట్‌ను ఆకస్మికగా తనిఖీ చేసిన తుమ్మల



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా జ్యోతి:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన పెసర కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన పెసర ను మంత్రి పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల తేమ శాతం నిర్ధారిత ప్రమాణం కంటే ఎక్కువగా ఉందన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు ఉన్న పెసరకు కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి తనిఖీ సందర్భంగా జిల్లా మార్క్ ఫెడ్ అధికారి సునీత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, అధికారులు, రైతులు తదితరులు వున్నారు.

## ఖమ్మం నగరాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తా





వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**ఖమ్మం టౌన్, ఆగస్టు 31, ప్రజా జ్యోతి:** నగరాన్ని ప్రణాళికాబద్ధంగాఅభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంత్రి నగరంలోని 34వ డివిజన్ లోని బురదరాఘవపురం లో రూ. 195 లక్షల వ్యయంతో నిర్మించనున్న మేజర్ స్మార్ట్ వాటర్ డ్రైన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. రోజువారి పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునకొల్లు నీరజ, కార్పొరేటర్లు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులను చిదిమేస్తున్నారు

## హద్దే లేని ఆగడాలు...! ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**కల్లూరు ఆగస్టు 31(ప్రజా జ్యోతి):**

నిరుపేదల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కొరకు వారిని బలోపేతం చేయుటకు సూక్ష్మ స్థూల పెట్టుబడుల ద్వారా ప్రభుత్వము ఆర్బిఐ నిబంధనల ద్వారా వ్యాపారం చేయుటకు మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు అనుమతించింది. గ్రామీణ ప్రాంతాలలో చిన్న సన్నకారు రైతులకు,సామాన్య నిరుపేదలకు చిన్న రుణాలు ద్వారా ఆర్థిక వెసులు బాటు కల్పిస్తూ వారి అభివృద్ధికి బాటలు వేస్తారు.స్వయం సహాయక గ్రూపుల ద్వారా ఐదు నుండి తొమ్మిది మంది సభ్యుల వరకు గ్రూపుల వారిగా రుణాలు ఇస్తూ ప్రగతి బాటలో నడిపించే కార్యక్రమము ఇది. కానీ దీనికి - మిగతా 7లో



## అధికారులు ఎవరూ పాలేరు దాటొద్దు

### నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



**ఖమ్మం రూరల్, ఆగస్టు 31, ప్రజా జ్యోతి:** తెలంగాణ వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పాలేరు నియోజక వర్గంలోని నాలుగు మండలకు చెందిన ఎంపిడిఓ లు, ఎమ్మార్వోలు, ఎంపీఓలు, స్పెషల్ ఆఫీసర్లు, విద్యుత్ శాఖ తో పాటు ఇతర శాఖల ముఖ్యాధికారులందరు నియోజక వర్గంలోనే ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని మండలాల్లో పరిస్థితిని ఆయా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు తాజా పరిస్థితిని తనకు ఫోన్ లేదా మెసేజ్ ద్వారా అందించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు తనకు తెలియకుండా నియోజకవర్గ పరిధి దాటి వెళితే వారి పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం

శ్రీ రాజసాయి ఆలయ చైర్మన్: జెన్నారెడ్డి విజయ నరసింహారెడ్డి.



పెనుబల్లి, ఆగస్టు 31(ప్రజాజ్యోతి): పెనుబల్లి మండలం వి.యం బంజర కొత్తగూడెం రోడ్డు నందు గల ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు శనివారం శ్రీ రాజసాయి మందిరం వియం బంజర వారి ఆధ్వర్యంలో ఖమ్మం మమత జనరల్ మరియు సూపర్ స్పెషాలిటీ మెడికల్ కాలేజీ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. సీనియర్ డాక్టర్ల అయన సాధారణ వైద్య విభాగం నుండి బాణాల రాజ రాహుల్, పి. ప్రవల్లిక, టి. సుకన్య చిన్న పిల్లల వైద్య విభగం నుండి బి. రమ్య, కే. శంషిత, కీళ్ళు ఎముకల విభాగం నుండి ములకలపల్లి జానకి, గోపాలదాసు వెంకట్, కంటి శస్త్ర చికిత్స విభాగం నుండి కె. మాధురి, కొండా శ్రీనిధి లు ఈ క్యాంపు నందు పాల్గొని 80,000/- రూపాయలు విలువ గల మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు రెండు వందల మంది కంటి సమస్యలతో బాధపడేవారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆపరేషన్ అవసరమైన సుమారు 50 మందిని ఖమ్మం మమత ఆసుపత్రికి వెళ్లాల్సిందిగా కోరారు. అక్కడ ఉచితంగా ఆపరేషన్లు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయబడునని రాజ సాయి మందిరం చైర్మన్ జన్నారెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండపాన్ని ఇచ్చి సహకరించిన మిట్టపల్లి నరేందర్, మాధవ్, పల్లపోతుల కృష్ణారావు, ఆచంటి శ్రీను లకు అమృతో మెడికల్ కాలేజీ యజమాన్యానికి క్యాంపుకు హాజరైన డాక్టర్లకు శ్రీ రాజసాయి మందిరం వ్యవస్థాపకులు జన్నారెడ్డి విజయ నరసింహారెడ్డి దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అంగన్వాడి కేంద్రాల్లో బోధించే ప్రణాళికా చార్ట్ ఆవిష్కరించిన సిడిపిఓ



కల్లూరు ఆగస్టు 31(ప్రజా జ్యోతి): కల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల చెన్నూరు సెక్టార్ లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రాల్లో బోధించే ప్రణాళిక చార్ట్ ను సిడిపిఓ నిర్మల జ్యోతి ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణలో అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని నాణ్యమైన పోషకాహారం అందించాలని,ఆటపాటల ద్వారా చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని,కేంద్రాల నిర్వహణకు సంబంధించి నెలవారీగా అందించే ఎంపీ ఆర్,ఎఫ్ సి ఆర్ నివేదికలను సక్రమంగా అందజేయాలని సూచించారు.సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 30 రోజులు పాటుగా జరుగనున్న పోషణ మాసోత్సవాలపై టీచర్లకు అవగాహన కల్పించారు.కేంద్రాల పరిధిలో పోషణ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ రత్నమ్మ,సూపర్వైజర్ వెంకటమ్మ,అంగన్వాడీ టీచర్లు ప్రభావతి ,పద్మావతి,మణెమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.


## వైరాలో సాంఘిక సంక్షేమ పాఠశాలలో పరిశీలించిన జెసి మధుసూదన్ రావు





వైరా, ఆగష్టు 31 ( ప్రజా జ్యోతి ): వైరాలోని తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం జెసి మధుసూదన్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు వచ్చిన మధుసూదన్ రావు విద్యార్థులు వంటలను పరిశీలించి రైస్ ను ప్రత్యేకంగా పరిశీలించి స్టోర్ సరుకులను ప్రతి ఒక్కదానికి పరిశీలించారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులతో మధుసూదన్ రావు మాట్లాడుతూ ఇదేవిధంగా విద్యార్థులకు ఇ విధమైన నాణ్యతతో వంటలు అందించాలని పాఠశాలలో వంటగదితోపాటు స్టోర్ రూమ్ శుభ్రంగా ఉంచడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సమత, కేర్ టేకర్ సంధ్య నిర్మల ఉపాధ్యాయులు ఉన్నారు.

## సాయిస్ఫూర్తిలో సమస్యలపై ఆన్ లైన్ సెమినార్.




సత్తుపల్లి ఆగస్టు31 ప్రజా జ్యోతి. ఆర్ సి.: మండల పరిధిలోని గంగారంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో చట్ట పరమైన సమస్యలపై శనివారం ఆన్ లైన్ సెమినార్ బీటెక్ విద్యార్థులు ,ఎంబీఏ డిపార్ట్మెంట్ , సాయిస్ఫూర్తి ఇన్స్టిట్యూషన్, ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సెమినార్ కు రిసోర్స్ పర్స న్ గా డాక్టర్ వెంకటేశ్వర్లు జాయింట్ సెక్రటరీ లీగల్ బ్యూరో యు జి సి న్యూ ఢిల్లీ వారిచే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పేటెంట్ హక్కులు, కాపీ రైట్, మార్క్ మొదలగు అంశాలపై విద్యార్థినీ ,విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు న్యాయపరమైన అంశాలు, చట్టాలు, మేధో పరమైన వస్తువుల నుండి వ్యక్తిగత, ఆర్థిక, ప్రయోజనాలు పొందటానికి కావలసిన న్యాయపరమైన అనుమతులు, సాధించటం, న్యాయపరమైన సలహాలు, పొందడం అంతేకాకుండా తమ ఆస్తులను కాపాడుకోవడం, హక్కులను పొందెందుకు ఎలా అని వివరించారు. ఏదైనా కొత్తది సృష్టించినప్పుడు దానిని ఎవరైతే సృష్టించి ఉంటారో, వారికి దానిమీద సంపూర్ణమైన హక్కులు కలిగి ఉండటాన్నీ పేటెంట్ హక్కులు, దానికి సంబంధించి న్యాయపరమైన విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి, కన్వీనర్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ డివిన్వి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ చీపు. బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫ్యాకల్టీ మెంబర్స్ విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు చేస్తే చర్యలు

ఆగడాలకు పాల్పడితే కేసు నమోదు చేస్తాం

ఎస్సై షేక్ షాకీర్




కల్లూరు ఆగస్టు 31(ప్రజా జ్యోతి): మండలంలో మైక్రో ఫైనాన్స్ సిబ్బంది స్వయం సహాయక సంఘాలకు చిన్న సన్న నిరుపేద మహిళలకు రుణాలు ఇచ్చి వసూలు చేయడం విషయంలో ఇబ్బంది పెట్టినా, ఆగడాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై షేక్ షాకీర్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై షాకీర్ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో మైక్రో ఫైనాన్స్ సూక్ష్మ రుణాలు స్వయం సహాయక సంఘాలు, మహిళలు 5 గురు సభ్యులు ఒక గ్రూపుగా ఏర్పాటు చేసికొని రుణాలు తీసుకుంటున్నారు. రుణాలు తీసుకున్న సభ్యులలో ఎవరైనా ఒకరు కట్టకపోయినా రాత్రి సమయంలో ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను ఇబ్బందులు పెడుతున్నారన్న విషయం మా దృష్టికి వచ్చిందని అన్నారు.ఎవరికైనా ఇబ్బంది కలిగితే 100 కు ఫోన్ చేసిన వెంటనే సహాయ సహకారాలు అందుతాయని భరోసా కల్పించారు.దీంతో మైక్రో ఫైనాన్స్ రుణాలు తీసుకున్న బాధిత మహిళలు ఎవరైతే ఉన్నారో వారు 100 కు ఫోన్ చేసి మా దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు.నెల రోజులుగా మహిళల నుండి 100 కు ఫిర్యాదులు వస్తున్నాయని,మైక్రో ఫైనాన్స్ ద్వారా రుణాలు తీసుకున్న గ్రూప్ సభ్యుల ఇళ్లకు రాత్రి సమయంలో ఎట్టి పరిస్థితుల్లో వెళ్లొద్దని ఆయన సూచించారు. ఆర్.బి.ఐ నిబంధనలు అనుసరించకుండా రాత్రి సమయాల్లో వెళ్లి ఇబ్బందులకు గురి చేసినట్లయితే అట్టి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వారి యొక్క నిబంధనలు ప్రకారం 6గంటల లోపే రుణాలు వసూలు చేయాలని కోరారు.గ్రామాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత వారి ఇళ్లకు వెళ్లి ఇబ్బంది పెట్టిన,కించపరిచే విధంగా మాట్లాడిన,దురుసుగా ప్రవర్తించినట్లు మా దృష్టికి వస్తే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.మైక్రో ఫైనాన్స్ సిబ్బంది మితిమీరిన, ఆగడాలు చేస్తే రాత్రి సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా పాల్పడితే అట్టి విషయాన్ని, సిబ్బంది పూర్తి సమాచారాన్ని మా దృష్టి తీసుకు వచ్చినట్లయితే వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.

## వరద నీటిని పరిశీలించిన ఏ .ఎం. సి .చైర్మన్ దోమా ఆనంద్.



సత్తుపల్లి ఆగస్టు31 ప్రజా జ్యోతి. ఆర్ సి.: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా సిద్ధారం రోడ్ లో నాళాలు పొంగి, వరద నీరు రోడ్డు పైకి వచ్చి వాహనదారులు ఇబ్బంది పడటంతో , సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు శనివారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా,మట్టా చెన్నారావు మున్సిపల్ కమిషనర్ రవి వరద ప్రదేశాన్ని పరిశీలించారు. నీరు ఎక్కువగా రావటంతో జల వనరుల శాఖ అధికారులతో మాట్లాడి, తక్షణమే చర్యలు చేపట్టండి, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పాదాచార్లకు ఇబ్బంది గల కుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినారు.

# డయల్ యువర్ డిఎం కు విశేష స్పందన.



సత్తుపల్లి ఆగస్టు31 ప్రజా జ్యోతి. ఆర్ సి.: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం కు విశేష స్పందన లభించినట్లు డిపో మేనేజర్ యు. రాజలక్ష్మి తెలిపారు. 3 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన ప్రోగ్రాంలో 15 మంది వివిధ రకాల సలహాలు, సమస్యలను తెలియజేశారు. ముఖ్యంగా దమ్మపేట బస్టాండ్ కు విజయవాడ వెళ్లే నైట్ హాల్ట్ బస్సులు తిప్పాలని కోరగా దానికి సానుకూలంగా స్పందించారు. మందలపల్లి బస్టాండ్ లో సిసి లో ఏర్పాటు చేయాలని చెప్పగా, త్వరలో సమస్య పరిష్కరిస్తానని, ఓ దివ్యంగుడు నాకు సదరన్ సర్టిఫికెట్ ఆంధ్రాలో ఉన్నదని, తెలంగాణలో బస్సు పాస్ ఇస్తారా అని అడగ గా ఎలాంటి అభ్యంతరం లేదని సమస్యను సులువుగా తేల్చి వేసినారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ విజయశ్రీ పాల్గొన్నారు.

# పదవి విరమణ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ రేవతికి ఘన సన్మానం



కల్లూరు ఆగస్టు 31(ప్రజా జ్యోతి): కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి పదవి విరమణ చేయుచున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాస్తి రేవతిని వైద్యులు,సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సీతారాం మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా వైద్యారోగ్య శాఖలో రేవతి అందించిన సేవలను కొనియాడారు. కల్లూరు వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్ మాట్లాడుతూ రేవతి క్రమశిక్షణ నిబద్ధత గల అధికారిణిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు,చెన్నూరు పిహెచ్సిల వైద్యులు ఇస్రత్ తబసుమ్, సూపర్వైజర్ శ్రీకర్,జిల్లాలో పనిచేయుచున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది,కుటుంబ సభ్యులు, బంధువులు,మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపానికి భూమి పూజ.




సత్తుపల్లి ఆగస్టు31 ప్రజా జ్యోతి. ఆర్ సి.: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద మండపానికి శనివారం భూమి పూజలు చేసినారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 4 ,5 సంవత్సరాలు నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా గతంలో ప్రజలు సహకరించిన విధంగా, ఈసారి కూడా సహకరిస్తే విజయవంతంగా గణేష్ నవరాత్రులు ద్విగ్గిజయంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట ప్రసాద్,దురిసెట్టి మాధవా చారి, సత్యనారాయణ,రవి కుమార్,రాజు,రవి,కోటి, రామిశెట్టి సుబ్బారావు, కోటగిరి జగన్నాధ రావు తదితరులున్నారు.

# కక్ష పూర్వకంగానే అంగన్వాడి టీచర్ పై ఆరోపణలు

**ఎగ్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కు అమ్ముతున్నారని పత్రికలో వచ్చిన ఆరోపణలు అవాస్తవం**

**లబ్ధిదారులకు సవ్యంగానే చేరుతున్నాయి**

**విచారణ అనంతరం విలేకరుల సమావేశంలో డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంగోపాల్ రెడ్డి వెల్లడి**



తిరుమలాయపాలెం, ఆగష్టు 31, ప్రజా జ్యోతి : సుద్దవాగు తండా గ్రామపంచాయతీ అంగన్వాడి కేంద్రంపై పలు పత్రికలలో వచ్చిన వార్తలు అవాస్తవమని డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంగోపాల్ రెడ్డి విచారణ అనంతరం విలేఖరుల సమావేశంలో పేర్కొన్నారు. ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం సుద్దవాగు తండా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టిక ఆహారంగా అందించే గుడ్లను పిల్లలకు ఇవ్వకుండా ఆయమ్మ ప్రమేయం లేకుండా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కు అమ్మేస్తున్నారని వచ్చిన వార్తలపై డిడబ్ల్యూఓ రామగోపాల్ రెడ్డి, సీడీపీఓ సరస్వతి లబ్ధిదారులను, విద్యార్థుల తల్లిదండ్రులను విచారణ చేసి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఏదైనా ఉంటే మాకు తెలియపరచాలని ఎంక్వయిరీ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. గర్భిణీలకు, విద్యార్థులకు సవ్యంగానే ప్రభుత్వ లబ్ధి చేరుతున్నట్టు వారు తెలిపారు. కావాలనే కక్షపూరితంగా అబద్ధపు ఆరోపణలు చేస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారని అంగన్వాడీ టీచర్ బేబీ అన్నారు. రెండు రోజులలో పత్రికల్లో చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించకుంటే స్థానిక స్టేషన్ లో పిటీషన్ ఇస్తామని అంగన్వాడీ టీచర్ బేబీ మీడియాకు తెలియ పరిచారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ ఉదయశ్రీ, కాకరవాయి సెక్టార్ సూపర్వైజర్ లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ మల్సూర్, బానోత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో ఆర్యవైశ్యుల అభివృద్ధే ధ్యేయం

**ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

**రాష్ట్ర ముఖ్యమంత్రి ని ఆర్యవైశ్య పెద్దల సహకారంతో కలుస్తా**

**ఆర్యవైశ్య సంఘం అభ్యర్థి మిట్టపల్లి కిరణ్ కుమార్**




వైరా, ఆగష్టు 31 ( ప్రజా జ్యోతి ): ఆర్యవైశ్య సంఘం పెద్దలు సూచనలు సలహాలతో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం ఎన్నికల అభ్యర్థి మిట్టపల్లి కిరణ్ కుమార్ అన్నారు. శనివారం వైరాలో కొప్పురావురి స్టిల్స్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో మిట్టపల్లి కిరణ్ కుమార్ మాట్లాడుతూ నేడు జరిగే ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నను నా 1 నెంబర్ గుర్తుకు ఎదురుగా ఓటు వేసి నన్ను గెలిపించాలని విజ్ఞప్తి , ఈ ఎన్నికల కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని, ఈ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్క ఆర్యవైశ్య సంఘ సభ్యులూారు ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలపై తొలిసారిగా తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత ని ఆర్యవైశ్య పెద్దలు ద్వారా కలిసి సమస్యలను వివరించి, సమస్యల పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆర్యవైశ్యుల పెద్దల అండదండలతో ఆర్య ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత సహకారంతో కలిసి వైరా మండలంలోని ఆర్యవైశ్యుల సమస్యల్లో దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకు ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ఆర్యవైశ్య యువత ఎంతో చేయడం జరిగిందని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం జరిగింది, నిత్యవసర సరుకులు బియ్యం పంపిణీ చేయడంతో పాటు ఆర్థిక చేయూత ను కూడా అందించామని, ఆర్యవైశ్య సభ్యుల సహకారం తో ఆర్యవైశ్య కళ్యాణ మంటపం ను అధునాతన గా రెన్నోవేషన్ చేయడం జరిగింది. అదే విధంగా భవిష్యత్తులో కూడా ప్రతి ఆర్యవైశ్య కుటుంబ అభివృద్ధికి పెద్దలు సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, కొప్పురావూరి వెంకటకృష్ణ ,నూకల వాసు,భుమాత కృష్ణ ముర్తి, నూకల ప్రసాదు ,కోప్పురావురి శబరి నాథ్, వజినేపల్లి చక్రవర్తి, రఘువీర్ ,యంద్రపుడి శంకర్ ,నిఖిల్ ,నంబూరి ప్రసాద్ ,సముద్రాల మురలీకృష్ణ, కోల్ల రాంబాబు, గజ్జల భాస్కర్, తెల్లాకుల సందీప్ ,సుగ్గల శ్రీను ,కొనతలపల్లి సుజిత్ ,వజినే పల్లి రవి, ధారా కృష్ణ, కటకం శివ ,చల్లా రమణ, వేముల కిషోర్ ,ఉదయ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకే సీఎం రిలీఫ్ ఫండ్..

**చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం శ్రీనివాసరావు..**

తల్లాడ, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి న్యూస్):ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం శ్రీనివాసరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం తల్లాడ మండలంలోని పాత పినపాక గ్రామంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పంపించిన చెక్కులను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య బారిన పడిన కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా ఉండేందుకు ఈ చెక్కులను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందని




వెల్లడించారు. రుణమాఫీ కానీ రైతులు ఎవరు ఆందోళన చెంద వద్దని, అర్హులైన ప్రతి ఒక్క రైతుకి రుణమాఫీ అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పెనుబల్లి వైద్యశాలలోని సమస్యలను పరిష్కారించండి..

### ఖమ్మం మెడికల్ సూపరిండెంట్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డి.సి.హెచ్.యస్): రాజ శేఖర్ గౌడ్ కి వినతిపత్రం





పెనుబల్లి, ఆగస్టు 31, (ప్రజాజ్యోతి): పెనుబల్లి వైద్యశాల లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుపాలని శనివారం హాస్పటల్ ను సందర్శించడానికి వచ్చిన ఖమ్మం జిల్లా మెడికల్ సూపర్డెంట్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీస్ రాజశేఖర్ గౌడ్ కి ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రి నిర్మాణానికి 15 ఎకరాలకు పైగా భూమిని స్థానిక రైతులు ఉదార స్వభావంతో దానంగా ఇచ్చారు. నటి వాణిశ్రీ , నిజాం చారిటబుల్ ట్రస్టు వంటి ఎందరో దాతలు ఇచ్చిన విరాళాలతో భవన నిర్మాణం జరిగింది. 1977 లో 30 పడకలతో ప్రారంభమై నేడు 50 పడకలుగా నడుస్తుంది. కొత్తగా నిర్మాణమయ్యే భవనాలు పూర్తయితే 100 పడకలుగా అభివృద్ధి చెందనుంది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ ఆసుపత్రి ద్వారా ఎంతోమంది నిరుపేదలు వైద్య సౌకర్యాలు పొందుతున్నారు. పూర్తి స్థాయిలో వసతులు లేక జిల్లా కేంద్రానికి లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన సమస్యలలో 1. అభివృద్ధి సలహా మండలిని క్రమం తప్పకుండా సమావేశ పరచాలి. వైద్య సేవలపై ఆశక్తి ఉన్నవారిని సభ్యులుగా నియమించాలి. 2. వారానికి ఒకటీ రెండు రోజులు సాధారణ శస్త్ర చికిత్సలు ( ఆపరేషన్లు ) జరిగే విధంగా ఏర్పాటు చేయాలి. అంటే సర్జన్ వచ్చే విధంగా చూడాలి. గతంలో ఇక్కడ పనిచేసి, ప్రస్తుతం కల్లూరులో పనిచేస్తున్న డాక్టర్ రమేష్ నైనా వారానికి రెండు రోజులు ఇక్కడకు డిప్టేషన్ పై పంపాలి. 3. కాన్పులు ప్రభుత్వాస్పత్రిలో జరిగే విధంగా గర్భిణీలకు భరోసా ఇవ్వాలి. ఏ సమయంలోనైనా కాన్పు చేసే వసతి కల్పించాలి. ప్రస్తుతం ఆ సౌకర్యం లేదు. 4. బ్లడ్ బ్యాంక్ పనిచేసేవిధంగా చూడాలి. 5. నవజాత శిశువులకు అవసరమయ్యే ఇంక్యుబేటర్ సౌకర్యం ఉండాలి. 6. డెంటల్, ఆర్థో డాక్టర్లు మాత్రం ఉన్నారు. ఆ విభాగపు శస్త్ర చికిత్స పరికరాలు లేవు. 7. చిన్నపిల్లల వైద్య నిపుణులు కావాలి. 8. రక్త పరీక్షా కేంద్రాన్ని అభివృద్ధి పరచాలి. సరిపడ కిట్లు అందుబాటులో ఉంచాలి. ప్లేట్ లెట్ కౌంట్ పరికరం సమకూర్చాలి. సీ.బీ.పీ మిషన్ ఏర్పాటు చేయాలి. ల్యాబ్ లో ఒక్కరే టెక్నీషియన్ ఉన్నారు. మరొకర్ని నియమించాలి. 9. షుగర్ రోగులకు ఉదయం రక్త నమూనాలు తీసుకునే ఏర్పాటు ఉండాలి. 10. మన ఆసుపత్రికి ఒక 108 అంబులెన్స్ ఉం డాలి. 11. ఈ.సీ.జీ మిషన్ పనిచేసే విధంగా చూడాలి. 12.డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి. 13. మరుభూమిగా ఉన్న ఆసుపత్రికి చెందిన స్థలాన్ని శుభ్రం చేయాలి. 14. రోగులకు కానీ, సిబ్బందికి కానీ ఉపయోగ పడేవిధంగా ఆసుపత్రి వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి. ఆసుపత్రికి ఎదురుగా ఉండే ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కూడా ఈ బస్ స్టాప్ ఉపయోగ పడుతుంది. కాబట్టి ఇట్టి సమస్యలను పరిష్కరించవలసిందిగా రాజ శేఖర్ గౌడ్ ను ప్రజా సఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో చలమాల విట్టల్ రావు, కాటినేని శ్రీను, గాయం తిరుపతిరావు, పంతంగి వెంకటేశ్వర్లు మొదలగు వారు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...





### తాసిల్దార్ కూరపాటి. అనంత రాజ్..

చింతకాని ఆగస్టు 31 ప్రజా జ్యోతి : మండల పరిధిలో ఎడతెరప లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతకాని తాసిల్దార్ కూరపాటి అనంతరాజు ప్రజలకు తెలిపారు మండలంలో నాగలవంచ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి దగ్గర వాగు పొంగిపొరలడంతో రాకపోకలు నిలిపియడం జరిగిందన్నారు ఖమ్మం నుండి బోనకల్లు వెళ్లే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు అంతేకాకుండా రాబోయే రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలందరూ విద్యుత్తు స్తంభాల దగ్గర చెట్ల క్రింద ఉండకుండా జాగ్రత్త పడాలని తెలిపారు మండలంలో ఎక్కడైనా భారీ వర్షాలతో వచ్చిన నీటి ప్రవాహాల వలన నష్టం వాటిల్లితే తాసిల్దార్ కార్యాలయానికి తెలియపరచాలని వెల్లడించారు ఈరోజు రేపు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు ఎవరు కూడా వాగులు దాటవద్దని అందరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు

# అధిక వర్షాలు కారణంగా ముందస్తు చర్యలు చేపట్టాలి



### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఆగస్టు 31, ప్రజా జ్యోతి: భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలపై, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ప్రజలు సహాయానికి 24/7 ఫోన్ నెం. 9063211298, టోల్‌ఫ్రీ నెం.1077కు కాల్ చేయాలని ఫోన్ నెం. కు వాట్సాప్ కూడా చేయవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలోని చెరువులు, నీటి వనరులపై నిఘా పెట్టాలని అన్నారు. చెరువులు, వాగుల్లోకి ప్రజలు వెళ్ళకుండా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న చెరువులు, రిజర్వాయర్లు, కాల్వల నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన సూచించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకల వద్ద మత్తడి పొంగిపొర్లే ప్రాంతాలను గుర్తించి 24 గంటలు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. జిల్లా అధికారులు తహశీల్దారులు, ఎంపిడిఓ, ఎంపివోలు భారీ వర్షాల నేపథ్యంలో హెడ్‌క్వార్టర్‌లో ఉండి సమన్వయంతో పనులు చేయాలన్నారు. చెరువులు, వాగుల వద్ద చేపలు పట్టడానికి అనుమతించవద్దని ఆయన అన్నారు. కల్వర్టులు, రోడ్లపై ప్రవాహాలు వున్నచోట రహదారిని మూసివేయాలని, ప్రజలు దాటకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. నీటి ప్రవాహాల వద్ద వలంటీర్లను ఉంచాలన్నారు. బ్యారికేట్స్ అవసరం ఉన్న ప్రతిచోట పెట్టాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం అందుబాటులో ఉంచుకొని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్థి, జంతు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. దామిని యాప్ గురించి అవగాహన కల్పించి, పిడుగుల నుండి రక్షణ పొందేలా చైతన్యం తేవాలన్నారు. నీటి ప్రవాహాల వద్ద వలంటీర్లను ఉంచాలన్నారు. బ్యారికేట్స్ అవసరం ఉన్న ప్రతిచోట పెట్టాలన్నారు. ఈ సమీక్ష లో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జెడ్పి సిఇఓ దీక్ష రైనా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి నాగలక్ష్మి, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు, తహశీల్దార్లు, ఎంపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి..

### డీజే సౌండ్ సిస్టం కు అనుమతులు లేవు.
### మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలే.
### చింతకాని ఎస్సై షేక్ నాగుల్ మీరా..




చింతకాని ఆగస్టు 31 ప్రజా జ్యోతి : గణేష్ నవ రాత్రి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని చింతకాని ఎస్ఐ షేక్ నాగుల్ మీరా శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. విగ్రహ ఏర్పాటు చేసుకునే గ్రామాలలో కమిటీ సభ్యులు ముందుగా మీ సేవలో ఆన్లైన్లో పోలీస్ వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డీజే సౌండ్ సిస్టం కు అనుమతులు లేవు విగ్రహం ఏర్పాటు చేసే రోజు నుండి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యత కమిటీదే అని తెలిపారు.ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యుల పేర్లు వివరాలు పోలీస్ స్టేషన్లో అందించాలని, ప్రధాన కూడళ్లలో రోడ్లను మూసివేసే విధంగా మండపాలను ఏర్పాటు చేయకూడదన్నారు, మద్యం సేవించి మండపాల వద్ద గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు, డీజేలకు, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. మండపాల వద్ద ప్రమాద నియంత్రణ ముందస్తు జాగ్రత్తలతో పాటు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిని ఆయన అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఉత్సవాలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్సై షేక్ నాగుల్ మీరా హెచ్చరించారు

# ఏట్ ఏ గ్లాన్స్ డైరీ ని ఆవిష్కరించిన కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజాజ్యోతి: ఖమ్మం జిల్లా ఎట్ ఏ గ్లాన్స్ 2023-24 డైరీని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నారు.

# భారీ వర్షాలు వస్తున్నాయి బీ కేర్ ఫుల్

**ఖమ్మం , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు**

**సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని ఫోన్లో సూచన**



ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజా జ్యోతి:గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా మరో రెండు నుంచి మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపిందని కావున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రజలందరని అప్రమత్తం చేయాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్లో ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తెలుసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయని అందువలన అత్యవసరం అయితేనే ప్రజలు ఇంటి నుండి వచ్చేలా సూచనలు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని వర్షాల వల్ల ఏర్పడే ఇబ్బందులను పరిష్కరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు సంభందిత అధికారులతో మాట్లాడాలన్నారు. సహాయక చర్యలు అవసరమైతే చేపట్టే విధంగా ముందస్తు జాగ్రత్తగా ఉండాలని రెండు జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి సూచించారు.

# దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సీతారాములు, సీత్యా నాయక్



ఖమ్మం, ఆగస్టు 31, ప్రజా జ్యోతి : నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా నియమితులైన వెన్నపూసల సీతారాములు, డైరెక్టర్ సీత్యానాయక్ శనివారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి వారిద్దరిని అభినందించారు. వెన్నపూసలకి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొడాలి గోవింద రావు, గుడిమళ్ళ మధు, చెర్వు స్వర్ణ, మట్టా దుర్గా రెడ్డి, జొన్నలగడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని ఉండే విధంగా వైద్య సేవలు ఉండాలి



**జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**





ఖమ్మం, ఆగస్టు 31, ప్రజా జ్యోతి: మెరుగైన వైద్య సేవలతో ప్రజల్లో నమ్మకం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం కలెక్టర్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మాతాశిశు ఆర్యోగ కేంద్రం ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాజువాలిటి, ఫార్మసీ, వార్డులు పరిశీలించారు. గర్భిణిలు, క్యాజువల్ వైద్య పరీక్షలకు వచ్చిన గర్భవతులు, రోగుల సహాయకులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డెలివరీ రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఇడిడి ల వివరాలు అడిగి, రెగ్యులర్ గా పర్యవేక్షణ చేస్తున్నది, లేనిది అడిగి తెలుసుకున్నారు. ల్యాబరేటరీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు.డెలివరీలు పెంచాలని, గర్భిణులకు రెగ్యులర్ చెకప్ అయ్యేలా చూడాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలను పరిశీలించి, ఎంతమంది టెక్నీషియన్లు ఉన్నది, ఎన్ని పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. మామోగ్రఫి చేపడుతున్నది, ఎన్ని కేసులు చేసింది అడిగి తెలుసుకున్నారు. పరీక్షల రిజిష్టర్ కలెక్టర్ తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. రోజుకు సరాసరి పేషంట్ల వివరాలు, ఏ ఏ వైద్యసేవలు అందిస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రకాల వైద్యపరీక్షలు, స్కానింగ్ లు ఉన్నవి అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ప్రసవాలు చేస్తున్నది, ఇడిడి రిజిష్టర్ నిర్వహణ గురించి ఆరా తీసారు. సాధారణ ప్రసవాల గురించి అవగాహన కల్పించాలని, గర్భిణులకు ముందస్తుగా సాధారణ ప్రసవాలకు చేపట్టాల్సిన చర్యలపై చైతన్యం తేవాలన్నారు. వైద్యాధికారులు, రోగులు, రోగుల సహాయకులతో ఆసుపత్రి సేవల గురించి వివరించి, వారికి విశ్వాసం పెంచాలన్నారు. ఆసుపత్రిలో సమస్యలు, కావాల్సిన సౌకర్యాలకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటూ వచ్చే వారితో ప్రేమపూర్వకంగా మెలగాలని, వారికి మెరుగైన సేవలు అందించాలని అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జర్వాలతో బాధపడేవారికి ఒక ప్రత్యేక వార్డు ఏర్పాటుచేసి, చికిత్స అందించాలన్నారు. వార్డులో 24 గంటలు వైద్యాధికారి అందుబాటులో ఉండి, ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భణి స్త్రీలు సాధారణంగా వైద్యపరీక్షలకు వచ్చిన వారికి ఒత్తిడిని జయించే శక్తి కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మేటిషన్ రూమ్ ను కలెక్టర్ సందర్శించారు. గర్భిణిలకు ఏనిమిది సార్లు ప్రక్రియ విధానంను డాక్టర్లు ఈ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ కాన్పుల వార్డు, ఐసియు, ఇన్ బోర్న్ యూనిట్, నవజాత శిశు సంరక్షణ కేంద్రం, అమృతం తల్లిపాల కేంద్రం, తల్లిపాలను సేకరించి, నీల్వ ఉంచే కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. టాయిలెట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.కలెక్టర్ పర్యటన సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. రాంబాబు, వైద్యాధికారులు, తదితరులు ఉన్నారు.

# జోరు వానలతో జాగ్రత్తగా ఉండండి

**కుండపోత వర్షాల నేపథ్యం లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి ఎంపీ రఘురాం రెడ్డి**

ఖమ్మం టౌన్, ఆగస్టు 31, ప్రజా జ్యోతి: బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం జల్లులు మొదలై క్రమంగా భారీగా మారడంతో అందరూ జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అత్యంత భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇప్పటికే ఉభయ జిల్లాల ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. పరిస్థితిని తెలుసుకుని. నిరంతరం క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తూ లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

## మున్సిపల్ సర్వసభ్య సమావేశం రసాభాస

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రసాభాస చోటు చేసుకుంది. పట్టణంలోని మున్సిపల్ కు చెందిన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీకు చెందిన కౌన్సిలర్లు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపల్ స్థలాలు ఆక్రమాలకు గురవుతున్న మున్సిపల్ యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు.

## జూరాల జలాశయానికి కొనసాగుతున్న వరద.. 45 గేట్లు ఎత్తివేత

**జోగులాంబ గద్వాల :** రాష్ట్రంలో మళ్లీ వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. జూరాల జలాశయానికి కూడా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు 45 గేట్ల ద్వారా 3.26 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2.20 లక్షల క్యూసెక్కులుగా ఉంది.ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నారాయణ పేట జిల్లా మక్తల్ మండలంలోని చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తింది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 2400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 2 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

# ఆర్టీసీలో మీసేవలు శెభాష్....అందుకోండి మా అభినందనలు





ఖమ్మం టౌన్, ఆగస్టు 31, ప్రజాజ్యోతి: ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ విరమణ అభినందన సభలో ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ కుమార్

ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీలో సుదీర్ఘకాలం వివిధ హోదాలలో పనిచేసి ఆరోగ్యంగా సంస్థ నుండి ఉద్యోగ విరమణ పొందుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సేవలను "శభాష్ మీ సేవలు అందుకోండి అభినందనలు" అంటూ ఖమ్మం డిపో మేనేజర్ ఉద్యోగులను అభినందించారు. శనివారం సాయంత్రం ఖమ్మం నూతన బస్ స్టేషన్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో డిపో మేనేజర్ పి.దినేష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులను పూలదండలు, పుష్పగుచ్చాలు, జ్ఞాపికలు, బహుమతులతో ఘనంగా సన్మానించారు.ముందుగా సంస్థ యాజమాన్యం తరపున సన్మాన పత్రం మరియు బహుమతిని ఇచ్చి శాలువాతో డిపో మేనేజర్ దినేష్ కుమార్ మరియు ఆఫీస్ సూపరింటెండెంట్ జయరాజు,అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రామయ్య లు ఘనంగా సన్మానించారు.సన్మానం పొందిన వారిలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆకుతోట శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి కంట్రోలర్ చిరుమనేని రామయ్య, వెంకటరత్నమ్మ, మరియు కండక్టర్లు వినుకొండ రామయ్య, రజిని పగడికత్తుల నాగేశ్వరరావు, కమల పొనుగోటి సీతారామారావు, లక్ష్మి దంపతులు ఉన్నారు. తమను ఘనంగా సన్మానించిన ఆర్టీసీ అధికారులకు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులకు బంధు మిత్రులకు సన్మాన గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు కుటుంబ సభ్యులు సహకరించి వారికి ఏ విధమైన లోటు రాకుండా చూడాలని డిపో మేనేజర్ కుటుంబ సభ్యులకు సూచించారు.వాస్తవంగా ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలు ఉన్నత విద్యల్లోనూ, ఉద్యోగాల్లోనూ, వృత్తుల్లోనూ రాణిస్తున్నారని తమ తల్లిదండ్రుల కష్టాన్ని, పనితనాన్ని చూసి పిల్లలు రాణించటం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు.రిటైర్మెంట్ తర్వాత తమ విశ్రాంత జీవితాన్ని ప్లాన్ చేసుకోవాలని ఆర్థిక విషయాలను, ఆరోగ్యాలను జాగ్రత్తగా చూసుకోవాలని డిపో మేనేజర్ సూచించారు. ప్రణాళికాబద్ధమైన జీవనం ద్వారా సంపూర్ణ జీవితాన్ని కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజారవాణా సంస్థలో సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు ఆదర్శవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులను తోటి ఉద్యోగులు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు శాలువాలు, పూలదండలు,జ్ఞాపికలతో ఘనంగా ఆత్మీయంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పి. దినేష్ కుమార్,అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రామిశెట్టి రామయ్య, ఆఫీసు సూపరింటెండెంట్ జయరాజు మరియు ఉద్యోగ,కార్మిక సంఘాల నాయకులు గడ్డం లింగమూర్తి,ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు,దమ్మాలపాటి శ్రీనివాసరావు,అప్పన పురుషోత్తమ రావు,కొమ్ము వినోదరావు, గుండు మాధవరావు,చావా రమేష్,గుగ్గిళ్ళ రోశయ్య, హెచ్చు బసవయ్య రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు తోకల బాబు,సామినేని శ్యామ్ సుందర్రావు,కందుల వెంకటేశ్వర్లు,జంగం వెంకటేశ్వర్లు, తిప్పారెడ్డి ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చల్లగుండ్ల కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల, ఏఎంసి చైర్మన్.





సత్తుపల్లి ఆగస్టు31 ప్రజా జ్యోతి. ఆర్ సి. : పట్టణంలోని ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మంత్రి తుమ్మల ముఖ్య అనుచరుడు చల్లగుండ్ల నరసింహారావు వారి మాతృమూర్తి అన్నపూర్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు శనివారం వారి స్వగృహానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా కల్లూరు వ్యవసాయం మార్కెట్ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి వారి స్వగృహానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతి కి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. ఆయన వెంట మిస్టు కాలేజీ అధినేత చలసాని సాంబశివరావు ఉన్నారు.

# తెలంగాణలో రెండ్రోజులు భారీ వర్షాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**గత రెండు రోజుల నుంచి భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు.**

**తాసిల్దార్ పివి రామకృష్ణ, ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, ఎస్ఐ కూచిపూడి జగదీష్.**

తిరుమలాయపాలెం, ఆగష్టు 31, ప్రజా జ్యోతి : తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక. అందులో భాగంగా మండల అధికారులు తాసిల్దార్ పివి రామకృష్ణ, ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, ఎస్ఐ కూచిపూడి జగదీష్ హర్ష బావ సమస్యలున్న ప్రాంతాలలో పర్యటించిసహాయకు చర్యలు చేపట్టారు.అధికారులు మాట్లాడుతూ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం శనివారం ఉదయం వాయగుండంగా మారింది. దీంతో ఈరోజు, రేపు తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. రెండు రోజులు రాష్ట్రంలో రెడ్ అలర్ట్ ప్రకటించింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతుంది.. రేపు తెల్లవారు జామున కళింగపట్నం, విశాఖపట్టణం, గోపాల్ పూర్ ప్రాంతాల్లో తీరందాటే అవకాశం ఉంది. ఈ క్రమంలో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం...భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు రోడ్లపైకి చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో. ఎమ్మార్వో. ఎస్సై. సూచించారు. మండల పరిధిలోని బీరోలు వద్ద గల రహదారిని పరిశీలించారు. మేడిద పల్లి... సుబ్లేడు వాగు అవతల ఇవతల ట్రాక్టర్లు పెట్టి ప్రజలను అప్రమత్తం చేశారు ఇప్పటికే వాగులు పొంగిపొర్లడంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.

# మార్క్సిజం ఓ శాస్త్రీయ సిద్ధాంతం







## కాలంతో పాటు మార్క్సిజం పయనం

## కమ్యూనిస్టులు దృఢంగా ఉండాలి

## సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా రెండో విడత రాజకీయ శిక్షణ తరగతుల్లో పార్టీ జిల్లాకార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం ఆగస్టు 31, ప్రజా జ్యోతి: మార్క్సిజం ఓ శాస్త్రీయ సిద్ధాంతమని సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు కమ్యూనిస్టులు దృఢంగా ఉండాలని సూచించారు. ఖమ్మం సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రమ్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన పార్టీ రెండో విడత రాజకీయ శిక్షణ తరగతుల్లో నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. మానవ సమాజం ఉన్నంత కాలం మార్క్సిజం ఉంటుందని అన్నారు. మార్క్సిస్టులు ప్రజా సమస్యలను విశ్లేషించడంతో పాటు దాని కారణాలను పరిష్కార మార్గాన్ని చూపాలని పేర్కొన్నారు. కాలంతో పాటు ప్రయాణించేది మార్క్సిస్టులు అని స్పష్టం చేశారు. మార్క్సిజం శాస్త్రి సిద్ధాంతమని, కమ్యూనిస్టులు దృఢంగా ఉండాలన్నారు. కాలానుగుణంగా చోటు చేసుకునే మార్పులను మార్క్సిస్టులు అర్థం చేసుకొని, పాలక ప్రభుత్వాల రాజకీయ వ్యూహాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మార్క్సిజం ఓ దిక్సూచిలా పనిచేయాలన్నారు. మతోన్మాదానికి విరుగుడు మార్క్సిజం మాత్రమేనని పేర్కొన్నారు. తొలి రోజు శిక్షణా తరగతుల్లో భాగంగా సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేశ్ ' గతి తార్కిక భౌతిక వాదం'పై బోధించారు. మధ్యాహ్నం పార్టీ సీనియర్ నాయకులు పి. సోమయ్య ' కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర' ఆవశ్యకతను వివరించారు.

శౌర్యయాత్ర కరపత్రం ఆవిష్కరణ..శిక్షణ తరగతుల ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి తెలంగాణ రాష్ట్ర కమిటీ రూపొందించిన శౌర్య యాత్ర కరపత్రాన్ని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గం, జిల్లా కమిటీ ఆవిష్కరించింది సెప్టెంబరు ఒకటి నుంచి 17 వరకు వీరులు నడిచిన దారుల్లో నిర్వహించే శౌర్య యాత్రను విజయవంతం చేయాల్సిందిగా నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వీర తెలంగాణ సాయుధ పోరాట బాట... వీధి వీధిలో మెరిసే నెత్తుటి పూదోటగా కళారూపాలతో ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు అదేవిధంగా ఈ యాత్రకు సంబంధించిన బ్రోచెర్ను ఈరోజు విడుదల చేసినారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేశ్, మాదినేని రమేష్, ఎర్ర శ్రీనివాసరావు ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శి లక్ష్మీనారాయణ, సదానందం, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హరినాధబాబు, భద్రకాళి



ఖమ్మం రూరల్ ఆగస్టు 31, ప్రజా జ్యోతి : ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా నియమితులైన బైరు హరినాధబాబు, డైరెక్టర్ కర్లపూడి భద్రకాళి శనివారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి వారిద్దరిని అభినందించారు. హరినాధబాబుకి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

## ఖమ్మం నగరపాలక సంస్థలో ఎమర్జెన్సీ కంట్రోల్ యూనిట్ ఏర్పాటు




ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 31, ప్రజాజ్యోతి:రానున్న మూడు రోజులు అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఖమ్మం నగరపాలక సంస్థ నందు ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగినది , అందువలన నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలందరూ ఏమైనా ఇబ్బంది ఉన్న ఎడల , 7901298265 ఈ నెంబర్ కి కాల్ చేయగలరు.

## తుఫాను ప్రభావంగా అప్రమత్తమైన అధికార యంత్రాంగం





కల్లూరు ఆగస్టు 31(ప్రజా జ్యోతి): మండల పరిధిలోని పోచారం పెద్ద చెరువు అలుగు వరద ఉధృతి,తాళ్లూరు వెంకటాపురం గ్రామాల మధ్య ఊర చెరువు అలుగు ఉధృతి ప్రభావంతో ప్రధాన రహదారులపై వరద నీటి ప్రవాహం పెరిగింది.దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఆయా గ్రామాల మధ్య రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.రహదారులపై ట్రాక్టర్లను అడ్డంగా పెట్టి బారికేడ్లను ఏర్పాటు చేశారు.

# సామాన్యులను చిదిమేస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

విరుద్ధంగా ఇదే అదునుగా భావించి నిబంధనలను తుంగలో తొక్కి చక్ర వడ్డీల ద్వారా వారి నడ్డి విరుస్తూ నిరుపేదల బతుకులను చిదిమేస్తున్న సంఘటనలు కనబడుతున్నాయి.

రోజు రోజుకి మైక్రో ఫైనాన్స్ ఆగడాలు శృతి మించుతున్నాయి.నెల వాయిదా చెల్లింపుల విషయంతో రాత్రివేళ బాధితుల ఇంటి ముందు వీరంగం చేస్తూ మహిళలను వేధిస్తున్న మైక్రో ఫైనాన్స్ సిబ్బంది ఆగడాలకు అంతే లేకుండా పోతుంది.

కల్లూరు మండల కేంద్రంలో మైక్రో ఫైనాన్స్ సిబ్బంది శాంతినగర్ కు చెందిన ఓ మహిళ తమ కుటుంబ అవసరాల నిమిత్తం సి ఎఫ్ ఎల్ అనే మైక్రో ఫైనాన్స్ కంపెనీ వద్ద రుణంగా తీసుకున్నారు. ప్రతినెల అనుకున్న తేదికి వాయిదాలు చెల్లిస్తున్నారు. నెల వాయిదా చెల్లించటం లేట్ అవ్వడంతో రాత్రి 10 గంటల సమయంలో మైక్రో ఫైనాన్స్ సిబ్బంది అంతా ఆ మహిళ ఇంటికి వచ్చి ముట్టడించారు.నడి రోడ్డు లో మైక్రో ఫైనాన్స్ సిబ్బంది పంచాయితీ పెట్టారు.అర్ధరాత్రి సమయంలో వచ్చి వేదిస్తూన్నరని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసిన పరిస్థితి నెలకొంది.ఒక్క నెల రుణ%శీ% కట్టటం లేట్ అయిందని అర్ధరాత్రి ఇంటికి వచ్చి నడి రోడ్డులో వేదింపులకు గురి చేస్తున్నారు.చుట్టు పక్కల వారు ఈటైంలో ఎందుకు ఇలా వచ్చి మాట్లాడుతున్నారు ఏమైనా ఉంటే ఉదయం మాట్లాడుకొండి అని చెబితే మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వారిపై కూడా రెచ్చిపోయి దురుసుగా ప్రవర్తించారనీ అంటున్నారు.ఒక ఆధార్ కార్డుతో 50 వేల నుండి లక్ష రూపాయలు రుణమిస్తున్నామని ఇచ్చేటప్పుడు లేని మీరు అర్ధరాత్రి సమయంలో మీరు ఎందుకు వచ్చారు అంటూ ఆమె బదులు నువ్వు రుణం కట్టు అంటూ వేదిస్తూ చుట్టు పక్కల వారికి సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు.పేద మహిళలను టార్గెట్ చేసుకొని రుణాలు ఇస్తాం అని ఆశ చూపి తీర రుణం తీసుకున్న తరువాత రక రకాల వేదింపులకు గురి చేస్తున్నారు.మైక్రో ఫైనాన్స్ వారి వేదింపులు తట్టుకోలేక ఆత్మహత్య లకు పాల్పడిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి.పేద వారిని టార్గెట్ చేసుకొని ధనర్జానే దేయ్యంగా మూడు పువ్వులు ఆరు కాయలు మాదిరిగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్న మైక్రో ఫైనాన్స్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# టి-సాట్లో ఆంగ్లంలోనూ గ్రూప్-1 పాఠ్యాంశ ప్రసారాలు

### సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆంగ్ల భాషలోనూ డిజిటల్ పాఠ్యాంశ ప్రసారాలు అందిస్తున్నట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం సుమారు 1200 గంటల తెలుగు పాఠ్యాంశ భాగాలు ప్రసారం చేసిన టి-సాట్ ఆగస్టు ఒకటవ తేదీ నుండి అక్టోబర్ 20వ తేదీ వరకు మేయిన్స్ పరీక్ష కోసం ప్రత్యేక పాఠ్యాంశాలు ప్రసారం చేస్తుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష రాసే అభ్యర్థుల కోసం క్రాష్ కోర్స్ 100 అరగంట నిడివిగల పాఠ్యాంశ భాగాలను సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి అక్టోబర్ 20వ తేదీ వరకు ప్రసారం చేస్తున్నట్లు సీఈవో వివరించారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో తెల్లవారు జామున నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు అదే రోజు సాయంత్రం ఏడు గంటల నుండి ఎనిమిది గంటల వరకు విద్య ఛానల్ లో పాఠ్యాంశాలు పున: ప్రసారం అవుతాయని వేణుగోపాల్ రెడ్డి వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల ఆదరణను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ప్రసారాలు చేస్తున్నామని, ఆంగ్లంలో పరీక్షలు రాసే అభ్యర్థులు టి-సాట్ పాఠ్యాంశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి కోరారు.